

అతివలే కీలకం

- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో మహిళల ఓట్లపై దృష్టి
- స్వశక్తి సంఘాల మహిళలే లక్ష్యం - రెండు సెగ్మెంట్లలో లోక్‌సభ మహిళా ఓటర్లు 2.44 లక్షలు
- జిల్లాలో 17,009 మంది మహిళల ఓట్లు అధికం

8లో..

కాంగ్రెస్‌కు ఓటు వేసి బాధ పడుతున్న జనం

- మోదీ పేదవాళ్లను దోచుకొని పెద్దలకు ఇచ్చాడు
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు కేటీఆర్



సిరిసిల్లలో రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు ఓటు వేసి చాలామంది బాధ పడుతున్నారని, పాలిచ్చే బర్రెను ఇడిసి పెట్టి పొడిచే దున్నపోతును తెచ్చుకున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్ పక్షాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శాంతినగర్, గాంధీచౌక్, తెలంగాణ తల్లి చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మి మోసపోయి కాంగ్రెస్‌కు ఓటు వేసి తినే పల్లెంలో మన్ను పోసుకున్నామని చాలా మంది బాధపడుతున్నారన్నారు. తనకు జన్మనిచ్చింది అమ్మ అయితే రాజకీయ జన్మనిచ్చింది సిరిసిల్ల అన్నారు. తనకే ఎందుకు ఓటు వేయాలని అడిగితే తాను చూపిస్తానన్నారు. సిరిసిల్లను జిల్లా చేసుకున్నామని, రోడ్లు బాగు చేసుకున్నామని అన్నారు. నేతన్నలకు బతుకుదెరువు ఇచ్చామని, హిందువులకు బతుకమ్మ చీరలు, రంజాన్‌కు తోఫా, క్రిస్మస్ కానుకలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేసీఆర్ కిట్‌లు ఇచ్చామన్నారు. మళ్లీ సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నలు కష్టాలో ఉంటే కాంగ్రెస్ నాయకుడు మహేందర్‌రెడ్డి హేళనగా మాట్లాడారన్నారు. కాంగ్రెస్ మాటలు విని ప్రజలు మోసపోయారని, బస్సు, బంగారం ఫ్రీ, మహిళలకు రూ. 2500, పించన్ రూ.4 వేలు, రూ.2 లక్షల రుణమాఫీతో మోచేతికి బెల్లంపెట్టి ఓట్లు వేసుకొని గద్దెనెక్కారని విమర్శించారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి కండువా లేకుండా గాంధీ చౌరస్తాలో నిలబడితే ఎవరూ గుర్తు పట్టారని, బస్ కోసం నిలబడ్డాడని అనుకుంటారని అన్నారు. డమ్మీని తీసుకొచ్చి నిలబెట్టారన్నారు. బీఆర్ఎస్, బీజేపీతోనే పోటీ అనిఅన్నారు. బీజేపీకి పనిచేయడం చేత కాదని, ఇంటింటికి అక్షింతలు పంచారని, అక్షింతలు అయోధ్య నుంచి రాలేదు ఇక్కడే కంట్రోల్ బియ్యంలో పసుపు కలిపి పంచారని అన్నారు. గుడి కట్టించి ఓటు వేయాలని అడుగుతున్నారని, బతుకుదెరువు కోసం చేసింది ఏమిటి అంటే ఏమీ లేదని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 ఎంపీ సీట్లు ఇస్తే అరు నెలల్లోనే కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తుందన్నారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు గుడ్ల శ్రీనివాస్, గుండ్లపల్లి నీరజ, దార్నం అరుణ, చందన, అడెపు సౌజన్య, అన్నారం శ్రీనివాస్, మాధవి, దినేష్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్లు పూర్ణచందర్, నారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు రామ్మోహన్, అగ్గిరాములు, గుండ్లపల్లి శ్రీనివాస్, మ్యాన రవి పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా మార్చేందుకు కుట్ర

వేములవాడ: హైదరాబాద్ నగరాన్ని ఉమ్మడి రాజధానిగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. సోమవారం వేములవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్‌ను మరో 10 ఏళ్లపాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు బీజేపీ, తెలుగుదేశం కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.500 కోట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. జడ్పీ చైర్ పర్సన్ అరుణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఆగ్రోస్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ కిషన్ రావు, ఎన్నికల ఇన్‌చార్జి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి ఉన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న వినోద్ కుమార్

కాంగ్రెస్‌కు ప్రధాని అభ్యర్థే లేడు

- కరీంనగర్‌లో ఆ పార్టీది మూడో స్థానం
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

జమ్మికుంట, మే 6: కాంగ్రెస్‌కు ప్రధాని అభ్యర్థే లేరని, అలాంటి పార్టీకి ఓటు ఎలా వేస్తారని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం జమ్మికుంటలో నిర్వహించిన బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనంలో మాట్లాడారు. తాము పువ్వు గుర్తుకు ఓటు వేయాలని తిరుగుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం గాడిద గుడ్డు గుర్తు పట్టుకొని తిరుగుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయాలనుకునే వాళ్ల బ్యాలెట్‌లో గాడిద గుడ్డు గుర్తు ఉంటేనే ఓటు వెయ్యాలన్నారు. మోదీపై విషం చిమ్ముతున్న నాయకులను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన కాంగ్రెస్ గ్రాఫ్ మాత్రం పెరుగడం లేదన్నారు. కరీంనగర్‌లో ఆ పార్టీ మూడో స్థానంలో ఉందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయనందుకు జనం తిడుతుంటే రేవంత్‌రెడ్డి గాడిద గుడ్డు పేరుతో చర్చను పక్కా దారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ధరల పెరుగుదల గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం బాధాకరమన్నారు. యూపీఏ హయాంలో రూ.12లక్షల కోట్ల స్కాంలకు పాల్పడిన గణత కాంగ్రెస్‌కు దక్కిందన్నారు. కరీంనగర్‌లో బీజేపీ గెలవాలని, దేశంలో మళ్లీ మోదీ ప్రధాని కావాలని అన్నారు. సమ్మేళనానికి హాజరైన బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై గురించి మాట్లాడుతూ దేశానికి దిశ, దశ చూపించగలిగే గొప్ప నాయకుడు నరేంద్రమోదీ అని భావించి ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీజేపీలో చేరారన్నారు. తమిళనాడులో బీజేపీ శక్తి వంతంగా తయారు కావడంలో అన్నామలై కీలకపాత్ర పోషించారన్నారు.

● మోదీ గుండెలో బండి సంజయ్‌కి ప్రత్యేక స్థానం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుండెలో బండి సంజయ్‌కుమార్‌కు ప్రత్యేక స్థానం ఉందని తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. తాను తెలుగులో మాట్లాడలేక పోతున్నానని చెప్పడంతో.. అందరు బాగా మాట్లాడుతున్నారని, మాట్లాడాలని కోరారు. సౌత్ ఇండియాలో బీజేపీని బలోపేతం చేయడానికి ఆయనకు జాతీయ స్థాయి పదవి ఇచ్చారని గుర్తు చేశారు. బండి స్ఫూర్తితోనే తాను తమిళనాడులో పాదయాత్ర చేశానని, ఆయన గెలిస్తే సామాన్యుడు గెలిచినట్లేనన్నారు. బండి చేసిన పోరాటాలు దేశానికి ఆదర్శమని, లాఠీలు, కేసులు, జైళ్లను లెక్క చేయకుండా ముందుకు వెళ్లారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకుని గద్దెనెక్కి ప్రజలను పూర్తిగా విస్మరించిందన్నారు.. కిసాన్ సమ్మాన్ నిధిని యూజ్‌లెస్ స్కీంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసిపారేశారని, రైతులకు మాత్రం సహాయం ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమర్‌కు మద్దతుగా నాయకులు మండలంలో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. మండలకేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ వివిధ గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ సంజయ్‌కుమార్ గెలుపు ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్, నాయకులు నాగసముద్రాల సంతోష్, ప్రసన్న, శ్రీకాంత్, మహేష్, తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



అన్నామలై, బండి సంజయ్‌కుమార్‌లను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

దేశ ప్రజలను వంచించిన బీజేపీని గద్దెదించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ
- కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా సమావేశం



ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

భగత్‌నగర్, మే 6: దేశ ప్రజలను వంచించిన బీజేపీని గద్దె దించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. సోమవారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సీపీఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశ వ్యాప్తంగా దళితులు, మైనార్టీలు, మేధావులపై దాడులు జరిగాయన్నారు. నరేంద్ర మోదీకి వివాహ వ్యవస్థపై గౌరవం లేదన్నారు. తాళి కట్టిన ఆలిని వదిలేసిన మోదీ విలువల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంతో సామాన్యులపై భారం పడిందన్నారు. సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని సీపీఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో దేశ ప్రగతి తిరోగమనంలో పయ నించిందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే కుల గణన జరిగి తీరుతుందన్నారు. .

● దేశభద్రత, మత సామరస్యం కోసం ఇండియా కూటమి రావాలి

- కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

దేశభద్రత, సమగ్రత, మతసామరస్యం కోసం కేంద్రంలో ఇండియా కూటమి రావాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మత విద్వేషాలు, మారణహోమాలు నిత్యకృత్యంగా మారుతాయన్నారు. రాజ్యాంగాన్ని, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తోందన్నారు. 330 పార్లమెంట్ సభ్యులున్న బీజేపీ ఈ ఎన్నికల్లో 400 సీట్లు గెలువాలని కోరుకుంటుందన్నారు. దీని వెనక రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే కుట్ర ఉందన్నారు. కరీంనగర్ పరిధిలో ఎంపీల్యాడ్స్ కింద 25 కోట్లు మంజూరుకాగా 5 కోట్లు మాత్రమే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారన్నారు. 20 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం చేతకాక మురిగిపోయాయన్నారు. చేసిన అభివృద్ధి చెప్పుకోవడానికి లేక రాముడి పేరుతో ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. సీపీఐ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం సంతోషకరమన్నారు. తన గెలుపు కోసం పనిచేస్తున్న సీపీఐ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, ఆయా జిల్లాల సీపీఐ కార్యదర్శులు పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూర్ గ్రామానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు నాయకులు సోమవారం కాంగ్రెస్ చేరగా పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఆహ్వానించారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్ గ్రామాల్లో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కర పత్రాలను పంపిణీ చేశారు. రాజేందర్‌రావును గెలిపిస్తే అండగా నిలుస్తాడన్నారు. రాజేందర్‌రావు వదిన ప్రతిభ, సోదరి రోహిణి, మేనకోడలు శిరీష ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఎల్లారెడ్డిపేట మాజీ ఉప సర్పంచ్ ఒగ్గు రజిత, పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట ప్రచారంలో రాజేందర్‌రావు కుటుంబ సభ్యులు

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 6: ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, పటిష్ఠ కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలింగ్‌కు తీసుకోవాల్సిన చర్యలపై సెక్టోరియల్ అధికారులు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు సరిగ్గా వారం రోజుల గడువు మాత్రమే ఉందని, ఓటర్ జాబితా ప్రకారం ప్రతీ ఓటర్‌కు బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్ సమాచార స్లిప్పు పంపిణీ చేయాలన్నారు. గ్రామాలలో ఇటీవల కాలంలో మరణించిన వారి వివరాలు పంచాయతీ కార్యదర్శి ద్వారా సేకరించి ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ సకాలంలో ప్రారంభించాలని, ముందుగానే మాక్ పోల్ పూర్తి చేయాలని అన్నారు. ప్రతీ 2 గంటలకు ఒకసారి పోలింగ్ వివరాలు రిపోర్ట్ చేయాలన్నారు. మొదటి 2 గంటల పోలింగ్ అత్యంత కీలకమని, అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈవీఎం యంత్రాల మాక్ పోల్ చేసిన తర్వాత తప్పనిసరిగా సీఆర్‌సీ చేయాలని, ఈవీఎం మరమ్మతుకు గురైతే వెంటనే సెక్టార్ అధికారులు దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. సిరిసిల్ల సహాయ రిటర్నింగ్ అధికారి పూజారి గౌతమి, ఆర్డీవో రమేష్, సెక్టార్ అధికారులు, సీపీవో శ్రీనివాసాచారి, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



మోదీ సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, మే 6 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడలో ఈ నెల 8వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తుళ్ల వీరేందర్‌గౌడ్ కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడో సారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చుతారని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ఉపాధ్య క్షుడు శీలం రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్, గాజుల సదానందం, కోడం శ్రీనివాస్, చొప్పదండి శ్రీనివాస్, పంపరి అర్జున్, అంకారపు రాజు, సుంకోజు రమేష్ చారి, మోర రవి, తాటి పాముల సత్యం, గుడ్ల విష్ణు, కోడం రవి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్

భారీ జన సమీకరణకు సన్నాహాలు

- 10న సిరిసిల్లలో కేసీఆర్ రోడ్ షో - స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సిరిసిల్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 10న సిరిసిల్లలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రోడ్‌షోకు భారీ జనసమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం రాత్రి సిరిస్లిలలోని చేనేత చౌక్ వద్ద బీఆర్ఎస్ ముఖ్యనాయకులు స్థలాన్ని పరిశీలించారు. చేనేత విగ్రహం ముందు బీఆర్ఎస్ నేత కేసీఆర్ ప్రసంగించే విధంగా నాలుగు రోడ్లవైపు జనం ఉండే విధంగా ఆలోచన చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నర్సింగరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామ్మోహన్, సత్తార్, రాజు, మల్లారెడ్డి, మురళి తదతరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 6: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రజలు సీ-విజిల్ యాప్‌తో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను మభ్య పెట్టేందుకు నగదు, మద్యం ఇతర వస్తువుల పంపిణీపై లైవ్ ఫొటోలు, లైవ్ వీడియోలను తీసి సీ-విజిల్ యాప్ ద్వారా పంపించాలని సూచించారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వంద నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. లైవ్‌ఫొటోలు, వీడియోలను తీసేటప్పుడు అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌లో ఉంచాలని తెలిపారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా లొకేషన్ నమోదవుతుందని పేర్కొన్నారు. సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, పార్టీ అభ్యర్థులు పంచే డబ్బులు, మద్యం, బహుమతులు వంటి వివరాలను ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించిన ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై ఫొటోలు, వీడియోలను పంపిచాలని కోరారు. ప్రజలు సీ- విజిల్ యాప్‌ను ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని, చుట్టు పక్కల జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అప్‌లోడ్ చేసి తమ దృష్టికి తీసుకుని రావాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలు సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందని, ఫిర్యాదులు చేసినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.









ఉపాధి కూలీల చుట్టూ నేతల ప్రదక్షిణలు




మల్యాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, తాటిపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల, మే 6: పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో పార్టీల నేతలు గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఎండలు దంచి కొడుతుండడంతో ఉదయం పూటే ఉపాధి హామీ పనులకు వెలుతున్న మహిళల వద్దకే నాయకులు పరుగెడుతున్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వారం రోజులుగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పోటీలు పడి ఉపాధి పనుల వద్ద ప్రచారం చేపట్టారు. ఎండ వేడి నివారణకు మజ్జిగ పాకెట్లు అందిస్తూ పనిలో పనిగా తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అన్ని గ్రామాల్లో రోజుకో పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికే అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద ప్రచారం పూర్తి చేయగా సాయంకాలం వేళలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

● సభలకు వెళితే రూ. 200

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తమ సభలకు వచ్చే మహిళలకు 200 రూపాయల చొప్పున అందిస్తున్నారు. ఉదయం ఉపాధి పనులకు వెలుతున్న మహిళలు సాయంత్రం ఎన్నికల సభలు, సమావేశాలకు వెళుతున్నారు. దీంతో వారికి కొంత ఉపాధి లభిస్తోంది.

మాజీ సీఎం కేసీఆర్ బస్సు తనిఖీ



కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలరూరల్, మే 6: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వాహనాన్ని పోలీసులు సోమవారం రాత్రి తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల నుంచి నిజామాబాద్ రోడ్ షోకి వెళ్తున్న క్రమంలో జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సును పోలీసులు తనిఖీ చేశారు. పోలీసు అధికారులకు కేసీఆర్ సహకరించారు.

గడి స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

● కలెక్టరేట్‌కు తరలి వచ్చిన చల్‌గల్ గ్రామస్థులు



వినతిపత్రాన్ని చూపుతున్న చల్‌గల్ గ్రామస్థులు

జగిత్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్‌గల్ గడి స్థలంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ గామస్థులు జగిత్యాలలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. గడి ముందు గల ఖాళీ స్థలంలో ఇటీవల ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం ప్రారంభించాడన్నారు. గ్రామానికి చెందిన ఉమ్మడి ఆస్తి అయిన గడి ముందు గల స్థలాన్ని ఆక్రమించడం సరైంది కాదని తెలిపారు. గడి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలోని అన్ని రకాల నిర్మాణాలు, కట్టడాలు తొలగించాలని కోరుతూ పలువురు గ్రామస్థుల సంతకాలతో కూడిన వినతిప్రతం సమర్పించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గెజిటెడ్ డాక్టర్ అసోసియేషన్ సభ్యులు

కోరుట్ల మే 6: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకున్న సంఘటనపై సోమవారం వైద్యులు, సిబ్బంది కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఆసుపత్రి అవరణలో నిరసన తెలిపారు. వైద్యులు సిబ్బంది చేస్తున్న నిరసనకు మద్దతుగా తెలంగాణ గవర్నమెంట్ గెజిటెడ్ డాక్టర్ అసోసియేషన్, ఐఎం అసోసియేషన్ సభ్యులు మద్దతు పలికారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజుల క్రితం డాక్టర్, సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడికి నిరసనగా వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించి కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతు డ్యూటీలో ఉన్న వైద్యులు సిబ్బందిపై దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓపీ సేవలను రద్దు చేసి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి శ్రీధర్, డీసీహెచ్ఎస్ జిల్లా అధికారిణి సురక్షతన సందర్శించారు. జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయం ఉన్నత అధికారులకు నివేదించి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రామయ్యపల్లెలో చోరీ

ధర్మపురి,మే6: మండలంలోని రామయ్యపల్లె గ్రామంలో ఊరడి జయకర్ అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగినట్లు ఆలస్యంగా తెలిసింది. రెండు రోజుల క్రితం జయకర్ రాత్రి వేళలో తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆరు బయట నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తలుపులు తెరచి 10 వేలు నగదు, 45 తులాల వెండి ఆభరణాలు, ఐదు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, మే6: మండలంలోని బొమ్మకల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 102 మంది వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి సభ్యులు కోల అన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎంఎల్ఎన్‌రెడ్డి, ఊట్కూరు రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొడిమ్యాలలో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, మే 6: మండల కేంద్రానికి చెందిన దండుగుల శేఖర్‌కు చెందిన గుడిసె సోమవారం ఉదయం దగ్ధమైంది. గుడిసెలోని నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, బట్టలు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కొడిమ్యాలలో దగ్ధమైన గుడిసెను పరిశీలించారు. శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల రూపాయలు అందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు ఉన్నారు.

రాజాపూర్‌లో పొలం దగ్ధం

రామగిరి, మే 6: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన ఎలువాక సంపత్‌కుమార్‌కు చెందిన అర ఎకరం పొలం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బురదగా ఉండడంతో కోపించిన వరిని కల్లంలో కుప్పగా పేర్చి ఉంచారు. సోమవారం అగ్ని ప్రమాదంలో వరికుప్ప దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమా రు 20 బస్తాల వడ్లు అగ్ని ఆహుతి అయ్యాయని రైతు తెలిపాడు.



పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 6: కరీంనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి నుంచి నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 5.32 లక్షల రూపాయలు పట్టుకున్నట్లు కరీంనగర్ మూడో టౌణా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. నగరంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళుతున్న డబ్బులను వేర్వేరు చోట్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుభాష్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తీగలగుట్టపల్లికి చెందిన ఒడ్నాల రవీందర్ వద్ద 3.32 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వావిలాలపల్లి ట్రినిటీ గర్ల్స్ జూనియర్ కళాశాల వద్ద వాహనాల తనిఖీల్లో గౌతమి నగర్‌కు చెందిన పింగిళి విష్ణువర్ధన్‌రెడ్డి వద్ద నుంచి రెండు లక్షల రూపాయ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారివద్ద తగి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి సీజర్ కమిటీకి స్వాధీనం చేశామని తెలిపారు.

● సైదాపూర్: మండలంలోని ఎలబోతారం గ్రామంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో 1.2 లక్షల నగదు పట్టుకు న్నట్లు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా 1.2 లక్షల నగదు తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ నగదును సీజ్ చేశామన్నారు.

● జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పలువురి వద్ద నుంచి ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న ఐదు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల ప్రాంతానికి తరలిస్తున్న టీవీలు, ఫ్రిజ్‌లను సీజ్ చేశారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో సీఐ వేణు గోపాల్. ఎస్సైలు నరేష్, మన్మధరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎండపల్లి, మే6: బతుకుదెరువు కోసం వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన దోనిపెల్లి హరికృష్ణ (28) అలియాస్ మనోజ్ కుమార్ జయశంకర్ జిల్లా మల్హర్ మండలం రుద్రారం గ్రామంలోని మెగా కంపెనీలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. పని వద్ద ఉదయం ట్రాక్టర్‌తో వ్యవసాయ బావి వద్దకు నీరు తీసుకురావడానికి వెళ్లాడు. నీరు పడుతుండగా నీటి ట్యాంకర్ ఎంత వరకు నిండిందో చూద్దామని ట్యాంకర్ పైకి ఎక్కాడు. కరెంట్ తీగ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని పోస్ట్‌మార్టమ్ కోసం జయశంకర్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి మరణ వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటిలో మునిగి గొర్రెల కాపరి మృతి

బోయినపల్లి, మే 6: నీటిలో మునిగి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన చిత్తరి పుల్లయ్య (20) అతని తల్లి, చెల్లితో సహా వేములవాడలో నివాసముంటున్నారు. కాగా పుల్లయ్య గత 6 నెలల నుంచి బోయినిపల్లి మండలం కొదురుపాకలోని కల్లెం రాజయ్య దగ్గర గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం గొర్రెలను తోలుకుని మేపడానికి మిడ్ మానేర్ బ్యాక్ వాటర్ వైపు వెళ్లి అక్కడే ఈత నేర్చుకుంటున్నాడు. ఎప్పటిలాగే సాయిలు అనే మరో గొర్రెల కాపరితో కలిసి మిడ్ మానేర్ వైపు వెళ్లి ఈత కొడుతూ స్నానం చేయడానికి నీళ్లలోకి దిగాడు. అక్కడే పూడిక ఉండటంతో అందులో కురుకుపోయాడు. మృతుడు పుల్లయ్య ఎంతకు రాకపోవడంతో పైన ఉన్న సాయిలు గ్రామంలోకి వెళ్లి కొందరు గ్రామస్థులను తీసుకువచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వాటర్ గుంతలో గాలించి పుల్లయ్య మృతదేహం బయటకు తీసి పోస్టుమార్టం కు పంపించారు. మృతుని తల్లి వజ్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మురళి తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- పోలీసులకు చిక్కిన దొంగలు

కోరుట్ల మే 6: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఏటీఎంలో ఆదివారం రాత్రి చోరీకి యత్నించారు. అదే సమయంలో మొబైల్ పార్టీ పోలీసు గమనించి దొంగలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మెదట పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాతంలో ఉన్న శ్రీలక్ష్మి వైన్స్ వద్ద ఉన్న సీసీ పుటేజీలను ధ్వంసం చేసి వైన్స్ షెటర్లకు ఉన్న తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేయగా అవి రాక పోవడంతో అక్కడే ఉన్న ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఏటీఎంలో సీసీ పుటేజీ ధ్వంసం చేసి మిషన్ పూర్తిగా ధ్వంసం చేసి దానిలో ఉన్న డబ్బులను తీసే ప్రయత్నం చేసారు. అదే సమయంలో మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి నేషనల్ హైవేపై పెట్రోలింగ్ చేస్తున్నాడు. ఎస్సై ఆ ప్రాంతానికి రావడంతో ఏటీయం వద్ద ఇద్దరు వ్యక్తులు కనపడడంతో అక్కడి వెళ్లి పరిశీలించాడు. ఏటీయం మిషన్ ధ్వసంమ్మై చోరీకి యత్నించినట్లు గుర్తించారు. ఏటీయంలో ఉన్న వారు పారిపోవడానికి ప్రయత్నం చేయగా వారిని పట్టుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా వారు మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. పట్టణంలో మామిడి కాయ దుకాణంలో కూలి పని చేయడానికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మద్యం మత్తులో ఉండి దొంగతనాలు పాల్పడుతుంటారని పోలీసు తెలిపారు. ఏటీఎం అధికారి శ్రీనివాస్‌రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కోరుట్ల ఎస్‌ఐ కిరణ్ తెలిపారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 15మంది రైతులు 159క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7 వేలు, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

డాక్టర్లు, సిబ్బందిపై దాడులు సరికాదు

సుభాష్‌నగర్, మే 6: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి దాడులు సరికాదని ఉమ్మడి జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు అన్నారు. డాక్టర్ ప్రతి రోగిని బతికించాలనే ప్రయత్నిస్తాడని, అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాడని అన్నారు. అయితే దురదృష్టవశాత్తు రోగి మరణిస్తే దానికి డాక్టర్‌ను బాధ్యుడిని చేయడం సరికాదన్నారు. రోగి బంధువులు విచక్షణ కోల్పోయి డాక్టర్, సిబ్బందిపై డీజిల్‌తో హత్యాయత్నం చేయడం ఆటవిక చర్యగా అభివర్ణించారు. ఆసుపత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి భయానకం సృష్టించడం హేయమైన చర్య అన్నారు. బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు.

● దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

కోరుట్లలో ప్రభుత్వ వైద్యుడు, సిబ్బందిపై దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ జి వెంకటరెడ్డి, తానా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మహేశ్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ వైద్యులు డాక్టర్ బిఎస్ రావు, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ కిషన్, డాక్టర్ అలీం, డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. ఈ దాడి అమానుష చర్యగా ఆయన పేర్కొన్నారు. హత్యాయత్నం చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ధ్వంసం చేసిన ప్రభుత్వ ఆస్తులను వారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ

● అడ్డు వచ్చిన వ్యక్తికి గాయాలు

ముత్తారం మే 6: ముత్తారం మండల కేంద్రంలోని నాగులమ్మ వైన్ షాపులో మద్యం సేవించి మద్యం మత్తులో రెండు వందల కోసం గ్రామానికి చెందిన మారం మల్లారెడ్డి, పింగిలి ప్రభాకర్ రెడ్డి అనే ఇద్దరు గొడవ పడ్డారు. గొడవ తీవ్రతరమై బీరు సీసాలు పగలగొట్టుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా కేషనపల్లి గ్రామానికి చెందిన ఎండి షరీఫ్ వారిని ఆపే ప్రయత్నం చేయగా సీసా షరీఫ్ మెడలో గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో ఉన్న అతనిని చూసి స్థానికులు 108కు ఫోన్ చేసి పెద్దపల్లికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఉన్నత వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

ప్రధాని పర్యటనకు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

వేములవాడ, మే 6: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ పర్యటన సందర్భంగా పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడలో పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి ప్రధానమంత్రి కార్యక్రమం సందర్భంగా బందోబస్తు నిర్వహణపై బ్రీఫింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటన సందర్భంగా 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను పూర్తి అప్రమత్తతో, ఐడి కార్డులను తప్పనిసరిగా ధరిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. హెలికాప్టర్ వద్ద విధులు నిర్వహించేవారు. అలర్ట్‌గా ఉండాలని, హెలికాప్టర్ వద్దకు ఎవరినీ రానివ్వకూడదని సూచించారు. ప్రతి అధికారి బందోబస్తు తనకు కేటాయించిన ప్రాంతంతో పాటు తాను నిర్వర్తించాల్సిన బాధ్యత గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్యూటీ ప్రదేశం నుంచి ఎవరు కూడా ఎట్టి పరిస్థితుల్లో వదిలి వెళ్లకూడదని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్ర చారి, చంద్రశేఖర్ రెడ్డి, వివిధ జిల్లాల నుండి వచ్చిన డీఎస్పీలు, సి.ఐలు ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం ఉనికికే ప్రమాదం తెస్తున్న బీజేపీ

● రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కుట్రలు పన్నుతున్న బీజేపీ ● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ

కరీంనగర్, మే 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉనికికే ప్రమాదం ఏర్పడనుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని హోదాలో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యక్తి ఆ రాజ్యాంగంపై ప్రమాణం చేసి దాని ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నారన్నారు. విదేశాల్లో స్విస్ బ్యాంకు నల్లధనం తిరిగి తెప్పిస్తామని, 15 లక్షల ఖాతాలో జమ చేస్తామని చెప్పిన మోదీ హామీ ఏమైందన్నారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో 29 మంది గుజరాతీలు వేల కోట్లు ఎగవేశారన్నారు. మోదీకి భార్యపిల్లలు లేరని ఎగ్గొట్టిన వారే దత్తపుత్రులన్నారు. 11 వేల కోట్లు తీసుకున్న నీరవ్‌మోదీ ఎలక్టోరల్ బాండ్లకు 30 శాతం కట్టారన్నారు. మోదీ మిత్రుడైన అదానీ గంజాయి స్మగ్లర్ అని వీరిద్దరూ ఒకేసారి పైకి వచ్చారన్నారు. బీజేపీయేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో పార్టీలను చీల్చి, ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతున్నదని నారాయణ ఆరోపించారు. రాష్ట్రంలో సైతం బీజేపీతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రమాదముందన్నారు. మహారాష్ట్రలో చేసిన విధంగా పార్టీల్లో చిచ్చులు పెట్టి ప్రభుత్వాలు కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీజేపీ తప్ప ఏపార్టీ మనుగడ సాగించ వద్దనే ఆలోచనతో మోదీ ఉన్నారన్నారు. అయోధ్య రామ మందిరాన్ని ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ఆదరాబాదరగా ఎన్నికలు సమీపిస్తున్నాయని ప్రారంభించారన్నారని అది అపశకునంగా మారిందన్నారు. దేశంలో రెండో విడత ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ఇండియా కూటమి వస్తే ముస్లింలు దాడులు చేస్తారని ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. ప్రశ్నించే వారిని సీబీఐ, ఈడీల పేరుతో వేధిస్తున్నారన్నారని, ఢిల్లీ ముఖ్యమంత్రిని జైలు పాలు చేశారన్నారు. మోదీకి వత్తాసు పలికినందుకు పది సంవత్సరాలుగా



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

జగన్ మాత్రం బెయిల్‌పైనే ఉన్నాడన్నారు. ప్రస్తుతం బీజేపీయేతర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డిపై వేధింపులు మొదలయ్యాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎంపీలు ఎన్నికవుతున్నారని, పార్లమెంట్ పరిధిలో పది లక్షలకు పైగా ఉన్న ఓటర్ల అభిప్రాయాలకు విలువ లేకుండా పోతోందన్నారు. 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు పన్నుతున్నారని నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతి, అహంభావంతో ఓడిపోయిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి అడ్డుకట్ట వేసేందుకే ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా చేరామని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ శ్రేణులు పనిచేస్తాయని నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కలవేన శంకర్, ఉమ్మడి జిల్లా సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

'కేడీసీసీబీ దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకు'

కరీంనగర్ టౌన్, మే 6: సహకార అభివృద్ధి నిధుల వినియోగంలో దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకుగా ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ నిలిచిందని నాబార్డు రిటైర్డు చీఫ్ జనరల్ మేనేజర్ డి.రవీంద్ర అభినందించారు. సోమవారం ఆయన సీడీఎఫ్ నిధులు వినియోగంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.మురళీధర్‌తో కలిసి నగరంలోని డీసీసీబీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ డిసిసిబి సక్సెస్ ఫార్ములాను దేశంలోని అన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి కేంద్రం, సిడిఎఫ్ వినియోగంపై అధ్యయనం చేసేందుకు నాబార్డు కమిటీని ఏర్పాటు చేసిందని అన్నారు. టెస్కాబ్ ఎండి మురళీధర్ మాట్లాడుతూదేశంలోనే కేడీసీసీబీ నాలుగు విభాగాల్లో వరుసగా నాఫ్‌స్కాబ్ జాతీయ అవార్డులను కైవసం చేసుకున్నామని తెలిపారు. అన్ని ప్రాథమిక సంఘాలను కంప్యూటరీకరణ చేసిన తొలి సహకార కేంద్ర బ్యాంకు కరీంనగర్‌లేదనని గుర్తు చేశారు. పిడిసి రిసోర్సు పర్సన్ జి. సత్యనారాయణ కేడీసీసీబీ సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బ్యాంకు సీఈవో ఎస్.సత్యనారాయణరావు, నాబార్డు డిడిఎం జయప్రకాశ్, మనోహర్‌రెడ్డి, దిలీప్, జనరల్ మేనేజర్లు పి.ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, డిజిఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ ఫిల్లింగ్

రాయికల్, మే 6: డీజిల్ ఫిల్లింగ్ చేసుకోవడానికి వచ్చిన ఓ ట్రాక్టర్‌లో పెట్రోల్ ఫిల్లింగ్ చేసిన సంఘటన రాయికల్ పట్టణంలోని జగిత్యాల రోడ్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో చోటు చేసుకుంది. బాధిత ట్రాక్టర్ యాజమాని కుర్మ మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తన ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ ఫిల్లింగ్ చేసిన విషయం తనకు తెలియదన్నారు. ఫిల్లింగ్ చేసిన పెట్రోల్‌ను బంక్ సిబ్బంది తొలగించే క్రమంలో సమాచారం రావడంతో బంక్ వద్దకు వెళ్లి చూడగా తన ట్రాక్టర్ నుంచి పెట్రోల్ తొలగించి, స్థానిక ట్రాక్టర్ షో రూం మెకానిక్‌తో రిపేర్ చేయడానికి బంక్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. సుమారు 2 గంటల పాటు ట్రాక్టర్ యాజమాని ఆందోళన చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది ఇరువురికి సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ట్రాక్టర్ యాజమాని సంబంధిత అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన బంక్ సిబ్బంది తీరుపై విచారణ జరిపి బంక్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పెట్రోల్ బంక్ సిబ్బందిని వివరణ కోరగా తాము డీజిల్‌కు బదులు పొరపాటున పెట్రోల్ ఫిల్లింగ్ చేసన విషయం వాస్తవమేనని అంగీకరించారు.

కేసీఆర్‌కు తెలంగాణ పదం ఉచ్చరించే అర్హత లేదు

● టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

కరీంనగర్ అర్బన్, మే6: తెలంగాణ ఉద్యమపార్టీ, రాజకీయపార్టీ అంటూ తెలంగాణ పదాన్ని బొందపెట్టి బీఆర్ఎస్‌గా మార్చుకున్న కేసీఆర్‌కు తెలంగాణ పదం ఉచ్చరించే అర్హతలేదని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికారప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. డీసీసీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్ కుమార్‌తో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, కవులు, విద్యార్థుల ఉద్యమాలతో 1200మంది ఆత్మ బలిదానాలతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేసీఆర్ అవినీతి పాలనకు కేంద్ర బిందువు అయిందన్నారు. గ్రానైట్, ఇసుక మాఫియాలతో గుట్టలు, వాగులు, నదుల ఆనవాళ్లు లేకుండా చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక అవసరాలకే ట్రాక్టర్లతో మాత్రమే ఇసుక తీసుకువెళ్లే అవకాశం కల్పించామని మృత్యుంజయం తెలిపారు. కాంగ్రెస్‌కు 8, బీజేపీకి 8, ఎంఐఎంకు ఒక సీటు పంచుకున్నారని హరీష్‌రావు వ్యాఖ్యలతో బీఆర్ఎస్ పార్టీకి ఏమి సీట్లు రావని చెప్పకనే చెప్పాడన్నారు. కరీంనగర్‌లో తీగల వంతెన, రివర్‌ఫ్రంట్‌లు కట్టమని ఎవరూ అడగలేదని, ఆ నాయకులు, కాంట్రాక్టర్ల కోసమే నిర్మించారని, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అవినీతి పాపాలు నేడు ఈ రాష్ట్రానికి శాపాలుగా మారాయన్నారు. కరీంనగర్‌లోని ఒక రైస్‌మిల్‌లో 600 కోట్ల విలువైన వరిధాన్యం ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా అక్కడే పెట్టారని, ఇంతటి అవినీతి జరుగుతున్నా పౌరసరఫరాల శాఖకు తెలియకుండా



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

ఉందనేది విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నారన్నారు. ముస్లింల రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేయాలని ఆయన ప్రశ్నించారు. మోదీతో చీకటి ఒప్పందం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించ కుండా, కేసీఆర్‌ను జైలుకు పంపించలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి 13 నుంచి 14 సీట్ల వరకు వస్తాయని, బీజేపీకికి మూడు లేదా నాలుగు సీట్లు రావ చ్చని, ఎంఐఎంకు ఒక సీటు వస్తుందని, బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర

● ఈనెల 8న రాజ్యాంగ రక్షణ సభ ● పజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల కాంతం

సుభాష్‌నగర్, మే6: ఆర్ఎస్ఎస్ మార్గదర్శనంలో రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దుకు బీజేపీ పూనుకోనున్నదని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల కాంతం ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు గెలుపొందడం ద్వారా సులువుగా రాజ్యాంగాన్ని రద్దు పరచవచ్చన్న అంగీకారానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు వచ్చాయన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్దేశించిన రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. దేశ సంపదను అదాని, అంబానీలకు ధారా దత్తం చేశారని విమర్శించారు. రైతులపై నల్ల చట్టాలను తీసుకువచ్చి 750 మంది రైతుల చావులకు కారకులయ్యారని ఆరోపించారు.

● రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు యోచనను వ్యతిరేకిస్తూ బుధవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో రాజ్యాంగ రక్షణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజ్యాం గం, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంయుక్తంగా చేసిన తీర్మాన ప్రతులు తమ వద్ద ఉన్నాయని, రాజ్యాంగ పరిరక్షణ సభలో బహిర్గతం



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం

చేస్తామన్నారు. రాజ్యాంగం రిజర్వేషన్ల రద్దుకు బీఆర్ఎస్ కూడా మద్దతు ఇస్తుందని, అందువల్లనే ఆ పార్టీ అధినేత కేసీఆర్ నోరు మెదపడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో సముద్రాల అజయ్, గజ్జల ఆనందరావు, కోండ్ర స్వరూప, సుద్దాల లక్ష్మన్, గోష్కి శంకర్, కల్లెపల్లి శంకర్, ఆవారు లత, భారతి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

కరీంనగర్ క్రైం, మే 6: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన ఒక అవివాహిత(39)ని అదే గ్రామానికి చెందిన గువ్వల సత్యం(44) ఏడాదిగా ఆమె ఫోన్‌కు కాల్ చేసి మాట్లాడుతూ వేధిస్తుండేవాడు. గత జులై నెలలో ఆమె ఇంటికి వెళ్లి అత్యాచారం చేశాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. వీడియోలు తీశానని బ్లాక్‌మెయిల్ చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నేరస్తుడిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మే 6 : కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్శేడ్‌కు చెందిన నేరెళ్ల సంపత్‌కుమార్(43) ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సంపత్‌కుమార్ చేగుర్తిలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని, ఆదివారం ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇరుకుల్ల వద్ద ద్విచక్రవాహనాన్ని యూటర్న్ చేస్తుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తీగలవంతెన పైనుంచి దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, మే 6 : కరీంనగర్ శివారులోని బైపాస్‌రోడ్ వద్ద తీగల వంతెనపై నుంచి కిందకు దూకి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో ఒక వ్యక్తి తీగల వంతెనపై నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని, అతని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉందని, ఎడమ కన్ను బొమ్మపై భాగంలో గాయానికి సంబంధించి ఏడు కుట్లు వేయబడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాకు వివరాలు తెలుపాలని పోలీసులు కోరారు. మృతుడి వివరాల కోసం ఫోన్: 8712670764, పోలీసు ఠాణా 8331940590లో సంప్రదించాలని కోరారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మార్చరీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాలపై ఎన్నికల కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మే 6 : ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను సమావేశపరిచి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో పాటు, 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త అయిన ఆకుల ప్రకాష్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్ రెడ్డి తెలిపారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా, సంబంధిత అధికారి నుంచి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా ఆదివారం ఉదయం హౌసింగ్ బోర్డ్‌కాలనీ లైబ్రరీ ఆవరణలో కొంతమంది ప్రజలను సమావేశపరిచి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించి, ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇంచార్జి, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బీ రమణారెడ్డి ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో పాటు, సభ ఏర్పాటు చేసినందుకు ఆకుల ప్రకాష్‌లపై ఎన్నికల నియామావళి ఉల్లంఘన కేసు నమోదు చేసామన్నారు.

వ్యవసాయ పొలాల్లో అగ్ని ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, మే 6: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, తిమ్మాపూర్, హరిదాస్‌నగర్ గ్రామ శివారుల్లోని వ్యవసాయ పొలాల్లో సోమవారం అగ్ని ప్రమాదాలు జరిగాయి. పొలాల చుట్టూ మంటలు వ్యాపించాయి. ఆయా గ్రామాల్లోని రైతులకు చెందిన పశుగ్రాసం, విద్యుత్తు మోటార్లు, స్టార్టర్లు, సాగు నీటి పైపులు కాలిబూడిదయ్యాయి. రైతులు చేరుకుని మంటలను అదుపు చేయడంతో చుట్టు పక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. తమను ఆదుకోవాలని కోరారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పశుగ్రాసం దగ్ధమైంది. బాధిత రైతు వెంకటరెడ్డి మాట్లడుతూ నాలుగు ఎకరాలలో పశుగ్రాసం కట్టలు కట్టి ఉంచామన్నారు. సోమవారం విద్యుత్తు తీగలు తగిలి మంటలు చెలరేగి గడ్డి కాలి బుడిదయ్యిందని తెలిపాడు. గతంలో సైతం గడ్డి కాలి పోయిందని వైర్లను సరిచేయాలని సెస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు



తిమ్మాపూర్‌లో కాలిపోయిన పశుగ్రాసం

ప్రభుత్వాలు నాణ్యమైన విద్య వైద్యం అందించాలి

● ఓటర్ల చైతన్య యాత్ర కన్వీనర్ ఆకునూరి మురళి

జమ్మికుంట రూరల్, మే 6: ప్రభుత్వాలు నాణ్యమైన విద్య వైద్యం అందించాలని జాగో తెలంగాణ ఓటర్ల చైతన్య యాత్ర కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. జాగో తెలంగాణ ఆద్వర్యంలో చేపట్టిన ఓటర్ల చైతన్య యాత్ర సోమవారం జమ్మికుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల సంక్షేమం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ఇవి తప్ప బీజేపి ప్రభుత్వం అన్ని చేస్తుందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, మోదీ ఇచ్చిన ఉద్యోగాలు కరీంనగర్‌లో ఎక్కడైనా కనిపించాయా చెప్పాలన్నారు. నల్ల చట్టాలు తీసుకు వచ్చి వందల మంది రైతుల ప్రాణాలు బలిగొన్నారని గుర్తు చేశారు. పదేళ్ల పాలించి ప్రజలను మోసగించిన బీఆరెస్ పార్టీని తరిమి కొట్టారని, అదేవిధంగా ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రత తట్టుకోలేక మహిళ మృతి

శంకరపట్నం, మే 6: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఎండ తీవ్రత తట్టుకోలేక అస్వస్థతకు గురై ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేశవపట్నం గ్రామానికి చెందిన పంజాల భారతి (55) సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురై ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు.

బీ ఫార్మసీ, బీపీఎడ్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే6: ఎస్‌యూ పరిధిలోని బీ ఫార్మసీ మొదటి, రెండు, ఏడు, ఎనిమిదో సెమిస్టర్, బీపీఎడ్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్వామివారికి మహాలింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మే 6: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి సోమవారం మహాలింగార్చన నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం స్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన చేశారు. లింగాకారంలో ప్రమిదలతో జ్యోతులు వెలిగించి పూజించారు.

రెండు దశాబ్దాలకు ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వేములవాడ, మే 6:వేములవాడ పట్టణంలోని గీతా విద్యాలయం విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2003-04 సంవత్సర 10వ తరగతి పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల అనంతరం ఒకరినొకరు కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు దేవీప్రసాద్, రమేశ్, జితేందర్, దేవేందర్, రాజేందర్, భాను ప్రతాప్, శశికాంత్, అమ్మాయి, రజిత, రామ్ కుమార్, మహేశ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కాంగ్రెస్‌లో చేరుతున్న సాదిక్

గంభీరావుపేట, మే 6 : రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ కో ఇన్‌చార్జి కొం దూరు గాంధీ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలపై ప్రతి పక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. లింగన్నపేట బ్రిడ్జి పనులకు మొదలు కాకముందే పాత బ్రిడ్జిని కూల్చివేయడం సరికాదన్నారు. వర్షాకాలంలో బ్రిడ్జి పూర్తి కాని పరిస్థితి ఏర్పడిందని, ఈ బ్రిడ్జి పాపం బీఆర్‌ఎస్‌దేనని అన్నారు.

● గంభీరావుపేట మండలంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కొండూరు గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాదిక్, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జంగ కాశీరాములు, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మనోహర్ రావు, మాజీ సర్పంచ్ రాజారాంరెడ్డి చేరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ నాగభూషనం. నాయకులు తదితరులు ఉన్నారు.

పార్లమెంటరీ సహ ఇన్‌చార్జి చక్రధర్‌రెడ్డికి సన్మానం

ముస్తాబాద్, మే 6 : కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ కో ఇన్‌చార్జిగా నియామకమైన సింగిల్ విండో మాజీ చైర్మన్ కనమేని చక్రధర్ రెడ్డిని ముస్తాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నాయకులు సన్మానించారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ యాదగిరిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు, మండల కో ఆప్షన్ మెంబర్ షాదుల్‌పాషా పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

ఎల్లారెడ్డిపేట, మే 6: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో నెలకొన్న లో ఓల్టేజీ సమస్యను సెస్ అధికారులు సోమవారం పరిష్కరించారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. ఇటీవల లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీటీసీ బాలరాజు యాదవ్ సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రజ్వల్ రేవణ్ణను అరెస్టు చేయాలి

సిరిసిల్ల టౌన్, మే 6: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కర్ణాటక హసన్ పార్లమెంట్ సభ్యుడు ప్రజ్వల్ రేవణ్ణను తక్షణమే అరెస్టు చేయా లని సోమవారం సిరిసిల్ల పట్టణంలో మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం సమగ్రంగా దర్యాప్తు జరిపి శిక్ష అమలు చేయాలన్నారు. జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వనిత తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులపై వినూత్న ప్రచారం

.బోయినపల్లి, మే 6: బోయినిపల్లి మండలం మన్వాడలో మహిళలకు సోమవారం ఉపాధి పని కల్పనపై వినూత్నంగా ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ ఏపీడీ నర్సింహులు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టు పెడుతూ అవగాహన కల్పించారు. ఏపీవో సబిత, పంచాయితీ కార్యదర్శి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నాయకులు

కోనరావుపేట, మే 6: కోనరావుపేట మండలానికి చెందిన పలువురు నాయకులు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. సీఎంతోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. మండల అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు మండలానికి చెందిన భాస్కర్, మల్లన్న తెలిపారు.

అతివలే కీలకం



- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో మహిళల ఓట్లపై నజర్
- స్వశక్తి సంఘాల మహిళలే లక్ష్యం
- జిల్లాలో 12,807 పొదుపు సంఘాలు
- 1.43 లక్షల మంది సభ్యులు
- 12 మండలాలు, రెండు మున్సిపాల్టీలు
- రెండు సెగ్మెంట్లలో లోక్‌సభ మహిళా ఓటర్లు 2.44 లక్షలు
- జిల్లాలో 17,009 మంది మహిళల ఓట్లు అధికం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ నుంచి పార్లమెంట్ ఓట్ల వరకు మహిళల ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇటీవల ముగిసిన శాసనసభ ఎన్నికల్లోనూ మహిళా సంఘాల ఓట్లను రాబట్టుకోవడానికి ప్రధాన పార్టీలు కీలకంగా వ్యవహరించాయి. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి స్వశక్తి సంఘాలను లక్ష్యం చేసుకొని ఆ సంఘాల లీడర్ల మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాయి. జిల్లాలో ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 17,009 మంది మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. రెండు సెగ్మెంట్లలో 4,72,116 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,27,534, మహిళలు 2,44,543 మంది ఉన్నారు. ఇందులో పురుషుల కంటే మహిళలు 17,009 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,46,212 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,19,582, మహిళలు 1,26,623 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 7041 మంది అధికంగా ఉన్నారు. వేములవాడ సెగ్మెంట్‌లో 2,25,904 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,07,952, మహిళలు 1,17,920 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 9,968 మంది అధికంగా ఉన్నారు. మహిళా ఓటర్లలో ఎక్కువ శాతం మహిళా సంఘాల సభ్యులుగా ఉండడంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు వారిని ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే లోక్‌సభ ఎన్నికల ముందే వడ్డీ బకాయిలను కూడా ముందస్తుగానే విడుదల చేయడం గమనార్హం. డిసెంబరు 2023 నుంచి మార్చి 2024 వరకు జిల్లాలోని 7802 సంఘాలకు రూ.7.39 కోట్ల వడ్డీ రాయితీని విడుదల చేశారు.

జిల్లాలోని మహిళా సంఘాల్లో 1,43,321 మంది సభ్యులు

జిల్లాలో 12,807 మహిళా సంఘాలు ఉన్నాయి. 12 మండలాలు, రెండు మున్సిపాల్టీల్లో మహిళా సంఘాలు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 9826 సంఘాలు ఉండగా సిరిసిల్ల మున్సిపాల్టీ పరిధిలో 2150, వేములవాడ మున్సిపాల్టీ పరిధిలో 831 సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పరిధిలో లక్షా 43 వేల 321 మంది సభ్యులు ఉన్నారు. 12 మండలాల్లో లక్షా 11 వేల 902 మంది సభ్యులు గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే సిరిసిల్ల మున్సిపాల్టీల్లో 22 వేల 405 మంది, వేములవాడ మున్సిపాల్టీల్లో 9014 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలు కూడా కీలకంగానే ఉన్నారు. వీరందరూ ఓటు హక్కు కలిగిన వారే కావడంతో వీరి మద్దతును కూడగట్టుకోవడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు దృష్టి పెట్టారు. మహిళా సంఘాల సభ్యులతో చర్చలు జరుపుతున్నారు. లోక్‌సభ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో మహిళా సంఘాల్లో అత్యధిక ఓటర్లు ఉండడంతో వారి ఓట్లను రాబట్టుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

రెండు పార్టీలు తెలంగాణకు చేసిందేమీ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, హాజరైన జనం

ముస్తాబాద్, మే 6: కాంగ్రెస్, బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కే తారకరామారావు అన్నారు. మండల కేంద్రంలోని దత్తసాయి గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ బూత్ స్థాయి కమిటీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ 420 హామీలతో గద్దెనెక్కి విస్మరించిందని, మరోవైపు మోదీ దేశావ్యాప్తంగా పేదల దగ్గర దోచుకొని అదాని, అంబానీలకు అప్పగిస్తు న్నారని మండిపడ్డారు. సిరిసిల్ల అభివృద్ధిపై ముస్తాబాద్ సాక్షిగా చర్చకు సిద్ధమని బండి సంజయ్‌కి సవాల్ విసిరారు. సిరిసిల్లకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధిపై మాట్లాడుతారనుకుంటే కేసీఆర్, కేటీఆర్‌పై తిట్ల దండకం తప్ప మానేరు నీటిపై రైతన్న, నేతన్నల కష్టాలపై మాట్లాడలేదన్నారు. పదేళ్లలో లేని ఆత్మహత్యలు కేవలం ఆరు నెలల్లో నేతన్న ఆత్మహత్యలు 5, రైతుల ఆత్మహత్యలు 250, ఆటో కార్మికులు 50 మంది ఎందుకు మరణిస్తారని ప్రశ్నించారు. రైతుల కలల సాకారం కావాలన్న చేనేత ఆత్మహత్యలు ఉండొద్దనుకున్న గొంతు విప్పే కేసీఆర్ ఉండాలన్నారు. తెలంగాణ అభివృద్ధిపై గొంతు విప్పే నాయకుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, జడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణ, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, ఎంపీపీ జనగామ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ మాజీ మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, విండో చైర్మన్ తన్నీరు బాపురావు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ మండల కేంద్రంలో ఇటీవల ప్రమాదానికి గురై మరణించిన విశ్రాంత ఉద్యోగి అబ్రమేని సాయిలు కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. భారీ గాలులు, వర్షానికి స్తంభం విరిగి ఎలుసాని ఎల్లయ్యయాదవ్ అనే రైతు మరణించగా కుటుంబాన్ని పరామర్శించారు.

తెలంగాణకు శ్రీరామ రక్ష

తంగళ్లపల్లి: తెలంగాణకు గులాబీ జెండానే శ్రీరామ రక్ష అని ప్రజల్లోకి తీసుకు పోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లిలో ఓ ఫంక్షన్ హాల్‌లో బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పదేళ్ల కేంద్రంలో బీజేపీ చేసింది శూన్యమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు ఒక్కటీ నెరవేర్చిన పాపన పోలేదన్నారు. నాయకులు రవీందర్‌రావు, రామారావు, ఉమ, ఆగయ్య, రాజన్న, మానస రాజు, రవీందర్‌రెడ్డి, సరస్వతి, దేవాస్, బాస్కర్‌గౌడ్, వెంకటరమణరెడ్డి, మధు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలతో బతుకులను ఆగం చేసిన కేటీఆర్



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, మే 6: మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ బతుకమ్మ చీరలతో బతుకులను ఆగం చేసిండని పద్మశాలీలు, నేత కార్మికులకు తెలసిపోయిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజవకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పీఠాలు కదులుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు తెలిసిపోయిందన్నారు. ఎక్కడా లేని ప్రేమను ఒలకబోస్తు, మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కోసం సిరిసిల్లలో కాళ్లకు బలపాలు కట్టుకొని తిరుగుతున్నాడన్నారు. రాజకీయంగా ఏ విధంగా వాడుకున్నాడో సిరిసిల్ల పద్మశాలీలు, కార్మికులకు కూడా అర్థం అయ్యిందన్నారు. ప్రభుత్వానికి నేతన్నల డబ్బులు ఇవ్వకపోవడానికి కారణం మనస్సులేక కాదని, ఆయన అవినీతి చేత రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలను చెల్లిస్తుందని, మొన్ననే రూ.50 కోట్లు విడదల చేసిందని తెలిపారు. మీరు చేసిన అప్పులైన అంచెలంచెలుగా ఎన్నికల కోడ్ ముగియగానే చెల్లించే బాధ్యత తమపై ఉందన్నారు. దీర్ఘకాలిక ప్రతిపాదనలను తీసుకొస్తూనే సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపుతామన్నారన్నారు. కేటీఆర్ ఇక్కడి నేతన్నలను ఓటు బ్యాంక్ రాజకీయాలకే వాడుకున్నారని, పరిశ్రమకు కావల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. సిరిసిల్ల మిడ్ మానేరు ఎవరు కట్టారో ప్రజలకు తెలుసని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో దాదాపు 85 శాతం పనులను పూర్తి చేసినట్లు చెప్పారు. కాళేశ్వరం, అన్నారం, సుందిల్ల బ్యారేజీల సంగతి ఏమైందో అందరికి తెలుసు మీదికెల్లి దబాయించే మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. సిరిసిల్ల నుండి టెక్స్‌టైల్ తరలిపోతుంటే ఎంపీ బండి సంజయ్ అప్పటి మంత్రి కేటీఆర్ పెదువలు కూడా విప్పని వీరు సిరిసిల్ల శవ రాజకీయాలు చేయడానికి వస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజా, మల్లేశం గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ పట్టణ అధ్యక్షురాలు వెల్మూల స్వరూపతిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అరుణ, కౌన్సిలర్లు వేముల రవి, కుడాకాల రవికుమార్, రెడ్యానాయక్, గుండ్లపల్లి రామానుజం, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య మాజీ కౌన్సిలర్లు యెల్ల లక్ష్మీనారాయణ, కత్తెర దేవదాస్, నాయకులు వైద్య శివప్రసాద్, కమలాకర్‌రావు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో టీడీపీకి పూర్వ వైభవం

సిరిసిల్ల టౌన్, మే 6: రానున్న రోజుల్లో టీడీపీకి పూర్వ వైభవం రానుందని, బలోపేతం కానుందని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు వంచ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో టీడీపీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఆవునూరి దయకర్‌రావు అధ్యక్షతన సిరిసిల్ల, వేములవాడ నియోజవర్గాల స్థాయి టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. త్వరలోనే తెలంగాణలో టీడీపీ ప్రతిపక్ష హోదాలో నిలుస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందన్నారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఆదేశాలను ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. సిరిసిల్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం, పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి అంజనేయులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మ్యాన వెంకటేశం, ఆడెపు లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సదానందం, టీఎస్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు నారాయణగౌడ్, సూర్యనాయక్, ప్రభాకర్, రాములు, రాంరెడ్డి, దేవయ్య, బాలరాజు, వెంకటేశం, కొమరయ్య, రంగారావు, ప్రకాష్, రామస్వామిగౌడ్, దేవయ్య పాల్గొన్నారు.

మూత్రశాలలను తొలగించాలి

సిరిసిల్ల రూరల్, మే 6: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో కట్టమైసమ్మ గుడి పక్కన ఏర్పాటు చేసిన మూత్రశాలలను తొలగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ డిమాండ్ చేశారు. మూత్రశాలను తొలగించాలంటూ సోమవారం ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ గుడిని అనుకోని మూత్రశాల ఉండడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. మనోభావాలను కాపాడాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. దూమాల శ్రీకాంత్, పల్లికొండ నర్సయ్య, పట్నాల శేఖర్, భాగయ్య తదితరులుపాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

వేములవాడ టౌన్, మే 6 : కోరుట్ల ఆసుపత్రి సిబ్బందిపై జరిగిన దాడికి నిరసనగా వేములవాడ ఏరియా ఆసుపత్రి సిబ్బంది నల్లబ్యాడ్జిలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్ మహేష్‌రావు, వైద్యులు తిరుపతి, సంతోష్ చారి, అనిల్‌కుమార్, సుభాషిని తదితరులు ఉన్నారు.

చిల్లార వేశాలను తిప్పకొట్టాలి

సిరిసిల్ల టౌన్, మే 6: రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఎమ్మెల్యే కేటీఆర్ చెంచాలు చేస్తున్న చిల్లర వేశాలను తిప్పి కొట్టాలని తంగళ్లపల్లి మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాను మార్చుతున్నారనే బీఆర్‌ఎస్ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. నాయకులు బైరి రాము, కంసాల మల్లేశం, లింగంపల్లి మధూకర్, దశరథం, సాయికుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యం


చందుర్తి, మే 6 : ఎస్సీ వర్గీకరణ అమలు బీజేపీతోనే సాధ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి మాదిగ అన్నారు. చందుర్తి మండలం మల్యాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీకి ఓటు వేసి కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలన్నారు. గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడు లోకోజు సతీష్, పొంచెట్టి తిరుమల్, పత్తిపాక శ్రీనివాస్, దురిశెట్టి రాజు, నగరం తిరుపతి పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ నాయకుల ప్రచారం

ఎల్లారెడ్డిపేట, మే 6: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి మూడో సారి నరేంద్రమోదీని ప్రధానిని చేయాలన్నారు. నాయకులు తిరుపతిరెడ్డి, బుగ్గారెడ్డి, గణేశ్, శ్రీశైలం, రామచంద్రారెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బాపురెడ్డి, బాలయ్య, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : నిరుపేదల అభివృద్ధి కేవలం మోదీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని జిల్లా దిశా కమిటీ సభ్యుడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బట్టు పీర్యా అన్నారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల, బంజేరు, అడవిపదిర, గర్జనపల్లిలో ప్రచారం నిర్వహించారు. లోక్ సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ను గెలిపించాలని అభ్యర్థించారు. బూత్ అధ్యక్షుడు బండారి మహేష్, నాయకులు ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ఇంటింటా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలంటూ సోమవారం సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెప్యాల రోహిణి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టి ఆరుగ్యారెంటీలను వివరించారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనిదేవదాస్, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మంద బాల్ రెడ్డి, తూముకుంట రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్తాబాద్: కరీంనగర్ పార్టీమెంటరీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సిరిసిల్ల కాన్వెసింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిరుదొడ్డి భానుకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీసీ సెల్ అధ్యక్షుడు శీల ప్రశాంత్, విజయ్‌రెడ్డి,విజయ్, మధు, నర్సయ్య పాల్గొన్నారు.

వీర్నపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ కోరారు. వీర్నపల్లి మండలం అడవిపదిరలో ఉపాధి పని ప్రదేశంలో ప్రచారం నిర్వహించారు. రాజేందర్‌రావును గెలి పించాలని మండల మహిళా అధ్య క్షురాలు జోగుల మంజుల ఇంటింటా ప్రచారం చేశారు.

వేములవాడ : కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని వేములవాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి రాజేందర్ రావుకు మద్దతుగా సోమవారం వేములవాడ పట్టణంలోని 16, 17వ వార్డులలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. నాయకులు కొమురయ్య, శ్రీనివాస్, మల్లేశం, లహరి, చందు, రాజు పాల్గొన్నారు.


వేములవాడ టౌన్ : మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్య మని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కనుకయ్య అన్నారు. వేములవాడ మండలం సంకెపల్లి, రుద్రవరంలో రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా నాయకులు శ్రీనివాస్‌రావు, సువర్ణ స్వామి, రాంరెడ్డి, పర్శరాములు, రాజ్‌కుమార్ ఉన్నారు.

కోనరావుపేట: వెలిచాల రాజేందర్ రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. సుద్దాల, మరిమడ్లలో సోమవారం ఉపాధి హామీ కూలీలను ఓటు అభ్యర్థించి ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఉన్నారు.

చందుర్తి : వెలిచాల రాజేందర్ రావు గెలిపించాలని కాంగ్రెస్ మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు రంజిత్ అన్నారు. గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుద్రంగి: వెలిచాల రాజేందర్ రావుకు మద్దతుగా మండల కేంద్రంలో సోమవారం జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, నాయకులు గంగనర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చూసి ఓటు వేయండి



ప్రచారం చేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ అరుణ

కోనరావుపేట, మే 6: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి పనులను చూసి ఓటు వేయాలని జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఉపాధి హామీ కూలీలతో పాటు ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. ఢిల్లీలో మాట్లాడే సత్తా బోయినపల్లి వినోద్ కుమార్‌కే ఉందన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ నర్సయ్య, బీఆర్‌ఎస్ నాయకులు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లి రాజుపేట శ్రీగాధ గ్రామాల్లో సోమవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి గౌడ్, ఎంపీపీ వంగా కరుణ సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ నారాయణరావు ఉన్నారు

ఇల్లంతకుంట: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో రైతుల ఇబ్బందులు పెరిగాయని జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడిలు అన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం ఒగులాపూర్‌లో ప్రచారంలో చపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తారన్నారు. ఎంపీ సంజయ్‌కుమార్ ఏనాడు అభివృద్ధి గురించి ఆలోచించలేదన్నారు. దేవుడి పేరుతో రాజకీయం చేయడం పరిపాటిగా మారిందన్నారు. వినోద్‌కుమార్‌కు ఓటు వేయడం ద్వారానే అభివృద్ధి జరుగుతుందన్నారు. నాయకులు ఎంపీటీసీ ముత్యంరెడ్డి, ఆరె కొమురయ్య, ఎరవెల్లి మల్లయ్య పాల్గొన్నారు.

వీర్నపల్లి : బీఆర్‌ఎస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ మాలోతు భూల అన్నారు. వీర్నపల్లి మండలంతోపాటు గ్రామాల్లో ఇంటింటా, ఉపాధి హామీ పనుల వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: పదవి ఉన్నా, లేకున్న ప్రజల కోసం పని చేసే వ్యక్తి వినోద్‌కుమార్‌ను పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీగా గెలిపించాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వినోద్‌కుమార్‌ను అత్యాధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీజేపీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా నాయకుడు గోపాడి సురేందర్‌రావు, మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, చంద్రశేఖర్, తిరుపతి, వెలిశాల రవి, మోత్కు మోహన్, అంబోజ లక్ష్మీనారాయణ, జింక వెంకటి, బైరగోని సురేష్, బెంద్రే శ్రీనివాస్ రెడ్డి, ఇస్తారి ప్రవీణ్, రేణుక పాల్గొన్నారు.